క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి



సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: గ్రామసచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని నెల్లేపల్లి గ్రామసచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలన్నారు. సమస్యలపై వచ్చిన అర్జీలపై వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. అనంతరం వెజ్జుపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి రోజు ఇళ్ల వద్ద చెత్తను సేకరించాలన్నారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు కీలకపాత్ర పోషిస్తే అంటురోగాలు రాకుండా ఉంటాయన్నారు. సర్పంచ్ రవీంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ శివయ్య కూడా పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించండి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం : డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను కంతుల ప్రకారం సక్రమంగా చెల్లించి గ్రూపులను ఏ గ్రేడ్‌లో ఉంచాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్రలపై ఉందని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. గురువారం ఆయన ఐకేపీ కార్యాలయంలో సంఘమిత్రలు, నూతనంగా బ్యాంకు రుణాలు తీసుకుంటున్న డ్వాక్రా సంఘాల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా కట్టించాల్సిన బాధ్యత సంఘమిత్రలదే అన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాలను సమయానికి చెల్లిస్తే ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు మురగయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.


మే డేని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి : ఈ ఏడాది మే 1వ తేదీన జరగనున్న 137వ మే డే దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. బుధవారం నగరి పట్టణంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకుని రావడాన్ని, పని గంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక వర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దాము, అయ్యప్ప, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరై, ఉష, మురుగమ్మ, ఎల్లమ్మ, సతీష్, శంకర్, ప్రకాష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహవాహనంపై అగస్త్తీశ్వరుడి కటాక్షం



సింహ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో బుధవారం రాత్రి సింహవాహనంపై ఉత్సవ మూర్తులు గ్రామ వీధుల్లో మేళతాళాలు, కోలాటాల మధ్య విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం నిత్యపూజాదికాల అనంతరం 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం అగస్తీశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగనున్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీనివాసుడు

తిరుపతి రూరల్: పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని బుధవారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల వారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రాధాన్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జీడీ నెల్లూరు నియోజక వర్గం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని చెప్పారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇదివరకు గుర్తించిన భూమికి హద్దులు నిర్ణయించి ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బంది నియామకం చేపట్టాలని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక పరిపుష్టికి వివిధ పథకాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా కృషి చేస్తున్నదని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్, ఎల్‌డీఎం, వ్యవసాయ అనుబంధ శాఖలు, డీఆర్డీఏ, మెప్మా డీసీసీబీ, సంబంధిత శాఖల అధికారులతో కలసి వివిధ శాఖల ద్వారా అమలుతున్న పథకాల అమలు తీరు, అందుకు బ్యాంకుల సహకారం తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు బ్యాంకర్లు అందిస్తున్న సహకారం ద్వారా ప్రజల ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు అవకాశం కలదన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం శేషగిరి రావు, వ్యవసాయ ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు మురళీధర్, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, డీఆర్డీఏ మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, జీఎండీఐసీ చంద్రశేఖర్, డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టూరిజం అధికారులతో బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం నాలుగు టూరిజం కేంద్రాలు ఉన్నాయని పులిగుండులో మాత్రం ప్రస్తుతం రిసార్ట్ నడుస్తోందని మిగతా ప్రాంతాల్లో మెయింటెనెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. బోయకొండ వద్ద టూరిజం కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇంకా కొత్త ప్రాజెక్ట్ ఏవైనా ఉంటే ప్రతిపాదనలు చేయాలన్నారు. చిత్తూరు సమీపంలోని తిమ్మసముద్రం, నగిరిలో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. కుప్పం సమీపంలోని ననియాల ఎలిఫెంట్ పార్కు సంబంధించి పనులను ఏ విధంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ టూరిజం అధికారులను అడిగారు. గుడివంక, పలమనేరులోని బాపూజీ పార్కు గుండుబావిలో నిర్వహణ గురించి అడిగారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో క్షేత్రస్థాయి పర్యటన చేసిన తర్వాత తగు నిర్ణయం తీసుకొని ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్ర కుమార్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ గిరిధర్ పాల్గొన్నారు.

చిరంజీవులు నాయుడు మృతి బాధాకరం



చిరంజీవులు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిరంజీవులు నాయుడు గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి చేరుకుని చిరంజీవులు నాయుడు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన చిరంజీవులు నాయుడు మృతి బాధాకరమని, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచ్ గాలి మహేష్ బాబు, నరసింహరాజు, ఎంపీటీసీ గోవిందరాజులు, నాయకులు వరదరాజు, పద్మనాభనాయుడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పెంపునకే ఆలయాల నిర్మాణం

– డీఈ శ్రీనివాసులు



సీడీ కండ్రిగ గ్రామంలో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న దేవదాయ డీఈ శ్రీనివాసులు

కార్వేటినగరం: గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకే గ్రామాల్లో హిందూ ఆలయాలను నిర్మిస్తున్నామని దేవదాయ డీఈ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలో 25 ఆలయాల నిర్మాణానికి గ్రామాల్లో పర్యటించి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి చొరవతో మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామాల్లో ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున 25 గ్రామాల్లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆలయాలు, శ్రీరాముడి ఆలయాలను నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. టీటీడీ వారు సౌజన్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఆలయ నిర్మాణాలను ఆయా గ్రామస్తులు సద్వినియోగం చేసుకుని ఆధ్యాత్మికతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయాలు మంజూరైన గ్రామాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, ధనుంజయవర్మ, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, జయపాల్, శేషాద్రి, కుప్పారెడ్డి, వీరాస్వామియాదవు, చందు రాజు, ధన్‌రాజ్, రాజారాం, వైస్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలి

- నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద బీజేపీ నేతల ధర్నా



చెరుకు రైతుల సమస్యలపై చర్చిస్తున్న నగరి ఆర్డీఓ సుజన

నింద్ర: నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీకి 2019–20 సంవత్సరంలో క్రషింగ్ సమయంలో చెరుకు సరఫరా చేసిన రైతులకు చెల్లించాల్సిన రూ.37 కోట్లు బకాయిలు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ రైతులకు ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన నెల రోజులకే పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం, ఇప్పటికి మూడేళ్లు దాటుతున్నా ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. గతంలో కూడా తాము యాజమాన్యం దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లామని, పంట సాగుకు చేసిన అప్పులు తీర్చడానికి ఇబ్బంది పడుతున్నారని కూడా వివరించామన్నారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం రైతులను మోసం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఇదే విషయాన్ని పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి, రైతుల సమస్యలపై నాయకులు విన్నవించారు. కానీ ఫలితం లేకపోవడంతో ధర్నా చేపట్టాల్సి వచ్చిందన్నారు. రైతుల సమస్యలపై పలుమార్లు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంపై రైతులు కోర్టులో వేసిన విషయాన్ని కూడా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. నగరి ఆర్డీఓ సుజన ధర్నా చేస్తున్న నాయకులు, రైతులతో చర్చించారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరి రూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రుడు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిబాబు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుణారెడ్డి, రైతువిభాగం నాయకులు శ్రీనివాసులు, రమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు: అర్హులుగా ఉన్న రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అర్హులుగా ఉన్న రైతులకు రైతు భరోసా రాకుండా ఉన్నట్లయితే ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. ఈనెల 30వ తేదీలోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

2400 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం పరచుకున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం సారా తయారీ బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 2400 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. అదేవిధంగా సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాదీన పరచుకున్నట్లు చెప్పారు. త్వరలోనే సారా తయారీదారులను పట్టుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారు చస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలుమార్లు సారా కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా సారా తయారు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

13న జాతీయ లోక్ అదాలత్

నగరి : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగరి జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. పలు రకాల కేసులను అక్కడికక్కడే పరిష్కారం అవుతాయని తెలిపారు. రాజీ పడడంతో ఇరువురు గెలిచినట్లే అని లోక్ అదాలత్ ద్వారా ఇరువురికి సమాన న్యాయం జరుగుతుందన్నారు. ఇందులో చిన్న చిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్ ద్వారా రాజీపడే అవకాశం ఉందన్నారు. కోర్టు కేసులు, భూములకు సంబంధించి, క్రిమినల్ కేసులు, కుటుంబానికి సంబంధించిన కేసులు లాంటి పలు రకాల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారంతో గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. నగరితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మండలాల నుంచి పలువురు గర్భిణులు పరీక్షల నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు. ఇలా వచ్చేవారు పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో అలాంటి వారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్‌కే రోజా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదినా చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ బాలకష్ణనాయక్, ఆర్ఎంఓ గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలాజీ

కార్వేటినగరం: పేదల అభ్యున్నతికి నిరంతరం పాటు పడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని సీడీ కండ్రిగ, కోదండరామాపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను గుర్తు చేస్తూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను వివరిస్తూ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఆర్థికంగా ఆదరిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని అభ్యర్థించారు. దీంతో లబ్ధిదారులు మాట్లాడుతూ కడుపున పుట్టిన పిల్లలు పట్టించుకోని రోజుల్లో తమ ఇంటికి పెద్ద కొడుకులా ఆదుకుంటున్నామని, ఆయనే మాకు పెద్ద దిక్కు అని జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను స్వయంగా వారే అంటించుకున్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే మా పయమని వృద్ధులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, ధన్‌రాజ్, సర్పంచ్ మంగమ్మ, ధన్‌రాజ్, వీరాస్వామియాదవ్, కుప్పారెడ్డి, భాస్కర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

అర్జీదారులతో స్నేహపూర్వకంగా మెలగండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై ప్రజలకు భరోసా కల్పించే దిశగా సిబ్బంది పని చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. గురువారం ఆయన వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి సచివాలయ ఉద్యోగి కూడా బాధ్యతగా సమయపాలన పాటించాలన్నారు. అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందని, సమస్యలతో వచ్చిన వారిని స్నేహపూర్వకంగా పలకరించి, వారి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. వలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి జయంతి



సంగీత గానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: టీటీడీ, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో సంగీత కళాశాల ఆవరణలో బుధవారం సద్గురు శ్రీత్యాగరాజస్వామి వారి 256వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీత్యాగరాజస్వామి వారి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సంకీర్తన గోష్టిగానంతో త్యాగరాజస్వామికి సంగీత నీరాజనాలు అందించారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో తిరుమలలోని నాద నీరాజనం వేదికపై త్యాగరాజ పంచరత్న గోష్టిగానంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి

కార్వేటినగరం : నాడు–నేడు పథకం కింద రెండో విడతలో మంజూరైన పాఠశాలల్లో నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్షణా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులపై హెచ్ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నాడు–నేడు కింద పనులు జరుగుతున్న స్కూళ్లలో నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు–నేడు కింద స్కూళ్లలో తాగునీరు, విద్యుత్ పనులు, మేజర్, మైనర్ మరమ్మతుల పనులకు నిధులు సిద్ధంగా ఉందని, బిల్లుల కోసం పనులను నిలిపి వేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి స్కూల్లో రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. స్కూళ్లలో పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, లోపాలను గుర్తించి నాణ్యతతో కూడిన నిర్మాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అధికారి విజయకుమార్, ఏఈ నాగభూషణం, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

లోకోస్ యాప్ సేవలు విస్తృతం చేయండి



సీసీలు, సంఘమిత్రలకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం రోజా

శ్రీరంగరాజపురం : మండలంలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలతో పాటు సమగ్ర వివరాలు క్రోడీకరించేలా రూపొందించిన లోకోస్ యాప్ సేవలు విస్తృతం చేయాలని ఏపీఎం రోజా అన్నారు. ప్రస్తుతం డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా భవిష్యత్‌లో దీని వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మండల, గ్రామస్థాయి సీసీలు, సంఘమిత్రలు దీనిపై సమగ్ర అవగాహన కలిగి ఉండేందుకే శిక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. కాగిత రహితంగా సంఘాల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, రుణాలు వాటి సద్వినియోగం, బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, రుణాల రికవరీ సంఘాలకు అందుతున్న లబ్ధి, సభ్యులు రికార్డులు, పుస్తకాల నిర్వహణ ఇలా అన్ని వివరాలను ఈ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. దీంతో భవిష్యత్‌లో సంఘ సభ్యులు ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. సీసీలు, సంఘమిత్రలకు ఈ యాప్ నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీసీలు సరసమ్మ, లావణ్య, శివయ్య, సంఘమిత్రలు పాల్గొన్నారు.

గుండెజబ్బుల నియంత్రణకే సెమీ ప్రాజెక్టు

- హార్ట్ ఎటాక్ రోగులకు సరైన వైద్యం అందించాలన్నదే ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం
- పుత్తూరులో స్టెమీ ప్రాజెక్టు నిర్వహణ బాగుంది
- ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి



పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లకు సూచనలు ఇస్తున్న స్టెమీ ప్రాజెక్టు బృంద సభ్యులు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గుండెజబ్బుల రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడిసిన్ రీసర్చ్(ఐసీఎంఆర్) స్టెమీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పుత్తూరు ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని ఆ ప్రాజెక్ట్ బృందం సందర్శించింది. ఆస్పత్రిలోని హార్ట్ ఎటాక్‌కు సంబంధించిన స్టెమీ ప్రాజెక్టు నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఈసీజీ నిర్వహణపై స్థానిక డాక్టర్ శంకర్‌నరేన్ నుంచి డెమో చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సెమీ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం గుండె జబ్బుతో వచ్చిన రోగికి ఈసీజీ తీసిన తర్వాత ఎస్టీ ఎలివేషన్ టైప్ హార్ట్ ఎటాక్ వస్తే వెంటనే ‹ఎలాక్సిమ్› అనే ఇంజెక్షన్ వేయడం జరుగుతుందని తెలిపారు. రూ.40 వేలు విలువ చేసే ఎలాక్సిమ్ ఇంజెక్షన్స్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచడం ఈ ప్రాజెక్టులో ప్రధాన అంశమని తెలిపారు. మెడికల్ కాలేజీ వారు ఈ ఇంజెక్షన్లను సరఫరా చేస్తారని వివరించారు. గత ఏడాదిగా దేశవ్యాప్తంగా అక్కడక్కడ స్టెమీ ప్రాజెక్టును నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గతేడాది ఆరుగురికి ఎలాక్సిమ్ ఇంజెక్షన్..

పుత్తూరు ఆస్పత్రిలో గత ఏడాదిలో ఆరుగురు రోగులకు ఎలాక్సిమ్ ఇంజెక్షన్ వేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు డాక్టర్ మునీశ్వరరెడ్డి తెలిపారు. పుత్తూరులో స్టెమీ ప్రాజెక్టు నిర్వహణ సంతృప్తికరంగా జరుగుతోందని వెల్లడించారు. అంతకుముందు ఆక్సిజన్ ప్లాంటు, జనరల్ వార్డు, క్యాజువాలిటీ, డెలివరీ రూమ్స్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అలాగే ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెంట్ డాక్టర్ శంకర్‌నరేన్, డాక్టర్లు అశోక్‌వర్ధన్, ఉదయ్, ప్రశాంతి, కృష్ణకాంత్, హెడ్ నర్స్ దిల్షాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ఈసీజీ తీసే యంత్రం పనితీరును పరిశీలిస్తున్న డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి

నేడు రామగిరిలో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీ సంతాన కాలభైరవ క్షేత్రంలో గురువారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లత తెలిపారు. భక్తులు ఆలయం ఎదుట ఉన్న మండపంలో నేతిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు, మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఇది పల్లవుల కాలం నాటి ప్రాచీన ఆలయం కావడం, ఆలయ కోనేరులో నంది విగ్రహం నోటి నుంచి జలధార ఏడాది పొడవునా వస్తుండడం విశేషం.